


# ప్రశాంతం

బి.ఎస్.రాములు

**రాముల ఎల్లయ్య స్వచ్ఛంద పదవీ విరమణ చేసి పదేళ్ళ యింది. నిజానికి అప్పుడీ పథకం లేదు. ఈ పేరూ లేదు. బొంబాయి బట్టల మిల్లులో సాంచాలు నడిపేవాడు. బిడ్డ విమల పెండ్లి కెదిగింది. అంతదాకా బట్టకు పొట్టకు నడిచింది. బిడ్డ పెండ్లి ఎట్ల చేయాల్నో తోచలేదు. అప్పు ఎక్కడ పుట్టక ప్రావిడెంటు ఫండు చేతికి రావడం కోసం చేస్తున్న పనికి రాజీనామా చేసిండు.**

బిడ్డ పెండ్లి అల్లుడు లక్ష్మణ్‌తో మంచిగనే జరిగింది. పనిమాత్రం పోయింది. దత్తాసామంత్ 1982లో సమ్మె చేయించినపుడు రెండున్నర లక్షలమంది పనిపోయింది. యాడాదిన్నర అప్పుడే ఎట్లనో ఒకట్ల బతికినం యిప్పుడు బతకరాదా అనుకున్నడు.

పనిపోతే పోయిందిలే అని ఎల్లయ్య బొంబాయి వదిలి బిడ్డ పెండ్లయినంక భీవండి చేరిండు. భీవండిలో పనిగంటలు ఎక్కువ. రోజుకు పన్నెండు గంటలు పనిచేయాలె. ప్రావిడెంటు ఫండు లేదు. కార్మికుల సంక్షేమ చట్టాలేవీ అక్కడ అమలులో లేవు. నాలుగేండ్లకే ఆరోగ్యం దెబ్బతిని ఇంటికచ్చి చేరిండు.

కొడిమ్యాల దగ్గర పల్లెటూరు ఎల్లయ్యది. పచ్చని చెట్లు, అడవి. ఊళ్లె ఉండుడు అలవాటైతే మల్ల ఏవూరికి పోబుద్దికాదు. తెల్లారిలేసి వాళ్లతోని వీళ్లతోని ముచ్చటవెట్టి అంబటాల్లకు ఈతచెట్లల్లకు పోయి వాడకం కల్లు తాగుడు. ఇంటికచ్చి యిట్ల ఎంతకాలమని కూసుండి తినుడు? చిల్లర పనులు చేసుకుంట పొట్ట కెల్లదీసిండు. కొడుకు పెండ్లి చేసిండు. వాల్లిచ్చిన కట్నం పెండ్లికర్చులకే సాల్లేదు.

మనుమలు, మనుమరాండ్ల పురుల్లు చేసిండు. వెయ్యి రెండువేల చొప్పున అప్పులు పెరగవట్టె. ఎల్లయ్యకు వయస్సు పెరుగుతున్నకొద్దీ వేరే బాధ్యతలు పెరుగుతున్నయి. మల్లా ఏదో ఒక పని చేయక తప్పలేదు. చేద్దామంటే సొంత ఎవుసం లేదు. నాగలి లేదు. ఎడ్లు లేవు. ఇంటిముంగట్నే యింత చాయె హోటల్ పెట్టిండు ఎల్లయ్య. అది కల్సిరాలేదు. ఉద్దెర లెక్కో అయినయి. పెట్టువడి లేకుంటైంది. ఇగ లాభంలేదని మల్ల భీవండికి పోవుడు సాతగాదని సిరిసిల్లలో పవర్‌లూం కార్మికుడుగా పనిలో చేరిండు. సిరిసిల్ల భీవండి కన్న నయమే. అక్కడి తీర్గ పాయిఖానకు లైను, పొట్టకు తినేకాడ లైను, పండుకునేకాడ లైను కట్టుడులేదు. మంచి చల్లని గాలివెలుతురు... పాణం హాయిగ అన్పించింది. కానీ సిరిసిల్లలో కరెంటు సరిగ్గా ఉండది. కరెంటు సరిగ్గా వుంటే నేసే భీములు సరిగ్గా వుండయి, పని సరిగ్గా వుండది. పని సరిగ్గా వుంటే కూలి సరిగ్గా వుండది.

ఏదో నడుస్తాందిగదా- పదిరోజులకోసారి యింటికి పోయిరావచ్చు. మనుమలు మనుమరాండ్లను కొడుకు కోడలు అందర్ని చూసుకోవచ్చు అనుకుని తృప్తి నింపుకున్నడు ఎల్లయ్య. పని సరిగ్గా నడవకపోయినా పెద్దగ బాధనిపించలేదు. పనిలేన్నాడు బస్సెక్కి యింటి కచ్చిపడు. అక్కడి కష్టమంత మర్సిపోవు. ఇంటికాడ నికార్సయిన ఈత కల్లు దొరుకు. అది తాగితే కమ్మటి నిద్ర.... ఇట్ల చేసీ చెయ్యక యింత పొట్టకు నడిపిస్తండు ఎల్లయ్య. ఇంకో బిడ్డ ఏడో తరగతికే సదువు బందుజేసింది. పెండ్ల కెదుగుతాంది. కొడుకు కోడల్ను దీసుకొని ఏదో పని చేస్త అని మెట్‌పెల్లికి మకాం మార్చిండు. ఇల్లంత బోసిపోయింది.

ఇట్లుండంగ అకస్మాత్తుగ ఒకరోజు ఎల్లయ్య పని చేసే పవర్‌లూం యజమాని ఆత్మహత్య చేసికొన్నాడు. పరిశ్రమ సరిగ్గా నడవక, అప్పులు ఎక్కువై వడ్డీలకు చాలక ఏంచేయాల్నో తోచక ఆత్మహత్య చేసుకున్నడని ఊరంత అనుకున్నరు. అప్పులిచ్చినోల్లు మనుసుల్నే తిట్టుకున్నరు. బాకీలు పెట్టినోల్లు ఎగపెట్టచ్చని లోలోపల సంతోషపడ్డరు.

గింత యిరాం లేకుంట పనిచేసినా బట్టకు గిట్టుబాటులేక పోవడం ఏమిటో ఎల్లయ్యకు అర్థం కాలేదు. తానైన యింటికాడ యింత కల్లుబొట్టు తాగుతడు కని తమసేటు కెటువంటి అలవాట్లు లేవు. పొద్దుందాక తెల్లందాక తమ తీర్గనే ఏదో పనిచేస్తనే ఉంటుండె. అయినా సేటుకు సేటు మందం జీతమైన గిట్టుబాటు ఎందుకు కాలేదు? తనకంటే తక్కువ కూలికి పనిచేస్తే తప్ప గిట్టుబాటు కాదా? ఇప్పుడేం కూడబెట్టిన ఈ కూలి పనిచేసి! ఇంకా తక్కోకు చేస్తే ఏం తింటం? ఎట్ల బతుకుడు?

పవర్‌లూం యజమానుల సంగం సంతాపసభ పెట్టిన్రు. అటు తర్వాత ఈ సంక్షోభం నుంచి ఎట్ల బయటపడాల్నో చర్చలు చేసిన్రు. ఎల్లయ్య ఇంకో సేటు దగ్గర పనికికుదిరిండు. యాడాది గడిసింది. అదేందోగని ఈ పవర్‌లూం యజమాని ఉరేసుకున్నడు. నూలు ధర పెరిగింది. కరెంటు ధర పెరిగింది. ఈరెండూ ధర తగ్గిస్తే ఈ ఆత్మహత్యలు ఆగుతయి అన్నరు కొందరు.

ప్రభుత్వం ఎనుక ముందు జూడకుంట బయటి దేశాలకు పత్తి, నూలు ఎగుమతికి అనుమతి యిచ్చింది. దాంతోని యిక్కడ దొరకక ధరలు రెట్టింపైనై. అట్ల జరగకపోతే ఈ యజమానులు ఆత్మహత్యలు చేసికోకపోదురు అన్నరు కొందరు. అవన్ని విన్నంక నిజమే అనుకున్నడు ఎల్లయ్య. ఇంకోచోట పని వెతికిండు ఎల్లయ్య. సిరిసిల్లలో ఎవరిదగ్గరైనా యిదే స్థితి.

ఎల్లయ్య మల్లా యింటికచ్చి చేరిండు. ఇంతలో ఎల్లయ్య పక్కింటి వెంకటయ్య పవర్‌లూం పని దొరకక ఆకలికి అప్పులకు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్టు తెల్సింది. పోస్టుమార్టం అయి డాక్టర్లు, పోలీసులు శవాన్ని అప్పగించేసరికి సాయంత్రం అయింది. అదే రాత్రి యింటికి తెచ్చిన్రు. కాలేసిన్రు. కేవలం యిరవైవేల రూపాయల అప్పు తీర్చలేక ఉరేసుకోవడం అందర్ని కలచి వేసింది. వెంకటయ్య భార్య ఏడ్పు చూసి ఏడ్వనోల్లు లేరు. వారం రోజులు కర్మకాండలు జరిగినై. తనే చచ్చిపోయినట్టు అవన్ని తనకే జరిగినట్టు గుబులు పట్టుకున్నది ఎల్లయ్యకు. ఏవేవో ఆలోచనలు. ఎల్లయ్యకు ఇంటికాడ ఉండబుద్ధికాలేదు. సిరిసిల్లకు పోబుద్ధికాలేదు.

అల్లుడు బిడ్డ రమ్మంటే ఎల్లయ్య గోదావరిఖనికి బయల్దేరిండు. అల్లుడు లక్ష్మణ్ చాలా మంచోడు. కాని అల్లుని కష్టాలు అల్లునివి. ఎవుడు ఏమవుతుందో తెలియదు.ఎంత చెడ్డా బిడ్డింటికి అల్లునింటికి ఎందుకు పోవద్దంటరో ఎల్లయ్యకి యిప్పుడు ఎరుకైంది.దూరంగ ఉన్నంతసేపు అల్లుడు బిడ్డ మంచిగ బతుకుతున్నరన్న తృప్తి ఉండేది. ఇప్పుడా తృప్తి తన భ్రమ అని తేలిపోయింది. మనుమలు మనమరాండ్లతో ఆడుకుంటె కాస్త ఊరటగుండేది ఎల్లయ్యకు.


అల్లుడు లక్ష్మణ్ పనిచేసి చేసి బొక్కలు తేలిండు. తాను అక్కన్నే ఏదైనా చిన్న వ్యాపారం మొదలుపెట్టాలనుకున్నడు. తండ్రి తమ దగ్గరున్నందుకు విమల సంతోషానికి అంతులేదు. పిల్లలను ఆడించుడు, నీల్లు తెచ్చుడు, కూరగాయలు తెచ్చుడు, బడికి తీస్కపోవుడు తోటి తండ్రి వల్ల విమలకు ఎంతో తీరిక దొరికింది. అల్లుడు, బిడ్డ కొద్దిగ నిగనిగ అయిండ్రు. కని ఎల్లయ్య పెట్టిన కూరగాయల బండి ఎక్కువ కాలం నడవలేదు. అప్పటికే చాలా మందైపోయిరి. ఇక ఇన్ల లాభంలేదని మల్ల యింటి దారి పట్టిండు ఎల్లయ్య.

ఎల్లయ్య పోతనన్నప్పుడు అల్లుడు బిడ్డ కండ్ల నీల్లు పెట్టుకున్నరు. అల్లుడు లక్ష్మణ్, తన తండ్రిని గోదావరిఖని రమ్మని ఎన్నిసార్లడిగినా రాలేదు. మీవూరికచ్చి నీముంగట మట్టి పని చేసుడు నీకు నామర్ద. నాకు గూడ మంచిగనిపియ్యది. పని చెయ్యకపోతే ఎల్లది. ఇంకా యిద్దరెట్ల ఎదగాలె. పెండ్లిల్లు ఎట్ల జెయ్యాలె అనెటోడు. ఇంట్ల యింటికి పెద్ద ఒకల్లుంటే యిల్లు ఎంత స్వర్గం తీరుంటదో అల్లుడు బిడ్డకు అప్పుడే తెల్సింది. అందుకే కన్నీళ్ళతో సాగనంపిన్రు.

ఎల్లయ్య మల్లా చేనేత మగ్గం నేయాలనుకున్నడు. ఆ బట్ట కొనేవాళ్ళు కనపడలేదు. పెట్టుబడికూడా చాలా కావాలె. తన దగ్గరలేదు. అందరూ నేత బట్టలు కొంటే నేత కార్మికుల ఆకలిచావులెందుకుంటయి అని ప్రశ్నించుకున్నడు ఎల్లయ్య. గర్శకుర్తిలో ఒక అయ్య దగ్గర చేనేత పనికి కుదిరిండు ఎల్లయ్య.

ఎక్కడ చూసినా మిల్లు బట్టలు. రెడీ మేడ్ బట్టలు. ఇతర దేశాల కెల్లి కూడ వస్తున్నయి. అవి వేసుకుంటెనే ఖదర్ అట. ఇక్కడికెల్లి పత్తి నూలు ఎగుమతి చేసుడెందుకు? అక్కడి బట్టలు దిగుమతి చేసుకునుడెందుకు? వాల్ల ఫ్యాషన్లతోటి మన నేతబట్ట పోటీ పడ్తదా? గాంధీకాలం నాడు చేనేత అన్నరు. స్వదేశీ అన్నరు. ఇప్పుడదంతా ఎక్కడపోయింది అని ఒక సంగం పెద్ద అంటుంటే ఎల్లయ్యకు సరిగ్గా అర్థంకాలేదు. తమ బతుకుల్లో మన్నువోస్తున్న మిల్లులు మూలకు వడ అని తిట్టుకున్నడు ఎల్లయ్య. ఎక్కన్నో తయారైన మాలు యిక్కడికి పంపి అమ్ముకుంటే మేం అక్కడికిపోయి పని చేసి బతికే స్వేచ్ఛ గూడ ఉండాలె. మేం కూడ అక్కడికిపోయి మా రెక్కల కష్టం అమ్ముకునే స్వేచ్ఛ లేకుంట అక్కడ తయారైన నూలు యిక్కడికి పంపి. అమ్ముతే మేం ఏం పని చేసికొని బతుకాలె అని ఎల్లయ్య ఆలోచనలు నాడెలాగా కొట్టుకుంటున్నై.

ఇక్కడికెల్లి పత్తి నూలు ఎగుమతి చేసుడెందుకు? అక్కడి బట్టలు దిగుమతి చేసుకునుడెందుకు? వాల్ల ఫ్యాషన్ల తోటి మన నేతబట్ట పోటీ పడ్తదా? గాంధీకాలం నాడు చేనేత అన్నరు. స్వదేశీ అన్నరు. ఇప్పుడదంతా ఎక్కడ పోయింది. అని ఒక సంగం పెద్ద అంటుంటే ఎల్లయ్యకు సరిగ్గా అర్థంకాలేదు. తమ బతుకుల్లో మన్నువోస్తున్న మిల్లులు మూలకు వడ అని తిట్టుకున్నడు ఎల్లయ్య.



దసరా పండుగకు అల్లుడు బిడ్డ, వియ్యంకులు, కొడుకుకోడలు మనుమలు మనుమరాండ్లతో ఎల్లయ్య పాత యిల్లు నిండిపోయింది. ఎన్నాళ్ళకో ఆ యిల్లు ఆనందంతో కళకళలాడింది. అది ఎన్నో రోజులు మిగులలేదు.

అల్లుడు లక్ష్మణ్ బాధపడ్తూ విషయం చెప్పిండు. అతన్ని కంపెనీలో డాక్టర్లు అన్‌ఫిట్ అన్నరని చెప్పిండు. స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకోమన్నరట.

"నన్నొక యంత్రం తీరు వాడుకొని వదిలేసుడేనా? నాకిచ్చిన జీతం ఎప్పటికప్పుడు ఖర్చయిపాయె. కాల్లు చేతులు కూలవడ్డంక ఎట్ల బతుకుడు? పిల్లలను ఎట్లా చదివించుడు! మల్ల ఏం పని చేసుడు! ఇప్పుడు కొత్త మల్ల ఏం పని నేర్సుకునుడు?" లక్ష్మణ్ అనడంతో దసరాపండుగకు కళకళలాడిన ఆ యిల్లు తెల్లారే చిన్నబోయింది.

"కుక్కకున్న విశ్వాసం ఆ కంపెనీకి కార్మికుల మీద లేదు. గింత అన్యాయమా?" ఎల్లయ్య కూతురు విమల తలబాదుకుంది.

"మనుషులకు పనిలేకుంట చేసే యంత్రాలు వస్తే మనుషులు ఏంపని చేసుకొని బతకాలె బావా?" అంటూ ఎల్లయ్య వియ్యంకుడు వీరయ్య ఎల్లయ్యనే అందుకు కారకుడైనట్టు నిలేసిండు.

"గదే నేనడుగుదామనుకుంటున్న. ఎవలనడుగాల్నో తెలుస్తలేదు బావా?" అన్నడు ఎల్లయ్య.

వియ్యంకుడు వీరయ్య మట్టి పనిచేసేవాడు. ట్రాక్టర్లు, ప్రొక్లెయినర్లు వచ్చినంక వీరయ్యకు పని దొరక్కుండపోయింది.

"చిన్నకొడుకు అరబ్బు దేశంల పని వెతుక్కుంటనని పైరవి చేస్తున్నడు. నీ దగ్గరేమన్న పైసలెల్తయా బావా?" అనడిగిండు వీరయ్య.

"కుల వృత్తులు కూడు పెట్టకపాయె. ఈ కొత్త వృత్తులు ఎప్పుడు పోతయో తెల్వదాయె. రేపటిమీద ఆశలేకపాయె. ఎట్ల బతుకుడు" అని ఏదో తత్వం పాట అందుకున్నాడు ఎల్లయ్య.

బైరాగులు పాడే ఆ తత్వం పాటలు చనిపోయినప్పుడు కర్మకాండల కాడ పాడుకునుటానికి పరిమితమైపోయినై.ఎల్లయ్య ఆ పాట పాడ్డంతో యిల్లంతా విషాదమైపోయింది.

"అందర్ని గొట్టి ఈ పరిశ్రమలు ఎవర్ని బతికిస్తున్నయి మామా? బక్కోడు, కుంటోడు కార్లపోయెటోనితోని పోటీపడ్తరా? మామా? పనిచేసే రెండు చేతులకు పని కల్పించని ప్రణాళికలెందుకు? ప్రభుత్వాలెందుకు?" అని విరుచుకుపడ్డడు అల్లుడు లక్ష్మణ్.

ఎల్లయ్యకు అంత పెద్దమాటలు రావుగని అల్లుడు మాట్లాడుతున్నదాన్ల న్యాయముందనిపించింది.

"ఆ తత్వం పాటల జీవుని గురించి అన్నట్టే వున్నది. పనిచేసే మనుషులకు జీవిత భద్రత లేకపోతే సమాజానికి భద్రత ఎట్లా వుంటది?పరిశ్రమలు మనిషికి సహకరించాలె గని మనిషిని తినేస్తే ఎట్ల బావా?" అన్నడు వీరయ్య.

ఆరునెలలు గడిచిన్నై. స్వచ్ఛంద ఉద్యోగ విరమణ కింద అల్లుడు లక్ష్మణ్‌కు వచ్చిన పైసలు తమ్ముడు అరబ్బు దేశాలకు పోవుటానికి చేసిన అప్పులు కట్టుటానికి పనికచ్చినయి.అల్లుడు లక్ష్మణ్ విమల కుటుంబంతో సహా యిల్లు చేరిన్రు. అంతదాకా స్కూలు డ్రెస్సులు టైలేసుకొని ప్రయివేటు స్కూల్లో చదువుకున్న అతని పిల్లలు సాదా డ్రెస్సుల్లో సర్కారు బడిపోతున్నరు.

లక్ష్మణ్‌కు ఆ పల్లె ఎంతో హాయిగా ఉందనిపించింది. ఆ పల్లె, చల్లగాలి అంతా మంచిగనే ఉందిగాని చేయటానికి పనిలేదు. దున్నుటానికి ఎవుసంలేదు. ఆగమాగంగ కార్మికునిగ డ్యూటీ చేసిన బతుక్కు తిరం లేకుండె. యిప్పుడు పల్లె మొత్తం తిరమే. తీరుపాటంగ బతుకుడు అలవాటు చేసుకున్నడు లక్ష్మణ్.



**పర్సనల్ పాయింట్**

**చల్లా సుబ్రహ్మణ్యం**

# నా కజిన్ లేకపోతే బతకలేను

కె.వి.లత-రాయచూర్

**ప్రశ్న: డియర్ చల్లాగారూ! నేను నా కజిన్‌ను మనసారా ప్రేమించాను. కజిన్ అంటే మా పెదనాన్నగారి అబ్బాయి. అతను లేనిదే నాకు బతుకు లేదు. అతను కూడా నన్ను గాఢంగా ప్రేమిస్తున్నాడు.మేం లీగల్‌గా పెళ్లి చేసుకునే అవకాశం వుందా? ఒకవేళ మేం పెళ్లి చేసుకునే అవకాశం లేకపోతే పెళ్లి చేసుకోకుండా అలాగే ఉండిపోవటానికైనా సిద్ధమే. మీ జవాబుకై ఎదురు చూస్తాను.**

**జవాబు:** ఈసమస్యకు నేను ఎన్నోసార్లు సమాధానం చెప్పాను.ఇలా పెదనాన్న, చిననాన్న కొడుకుల్ని- పిన్ని పెద్దమ్మ పిల్లల్ని చేసుకొనే ఆచారం కొన్ని జాతుల్లో ఉంది. అలాగే మేనమామను చేసుకునే ఆచారం దక్షిణ భారత దేశంలో ఉంటే- మేనమామని తండ్రిలా గౌరవిస్తారు ఉత్తర భారతీయులు. పోతే మన హిందూ సంప్రదాయం ప్రకారం మీ పెళ్లి చెల్లదు. మీ ప్రేమని మీ మనసుల్లో అలాగే భద్రపరుచుకుని- అందరిలా ఆలోచించడానికి ప్రయత్నించండి.మీ పెళ్లి మీ ఇద్దరి కుటుంబాలనూ- మిమ్మల్ని అనేక చిక్కుల్లో పడేయటమే కాకుండా భావితరాల వారిని కన్‌ఫ్యూజ్ చేస్తుంది. ఒక్కసారి ఆ ప్రేమ పరదాను పక్కకు నెట్టేసి-మన సంప్రదాయాల్ని గుర్తుకు తెచ్చుకుని ఆలోచించు కోండి.మీరు చేస్తున్నది మంచి పనా? కాదా? అన్న ది మీకే స్పష్టంగా అర్థమవుతుంది.

**ఆత్మహత్యకు తేది నిర్ణయించుకున్నాను**

వినోద్-వరంగల్

**ప్రశ్న: చల్లాగారికి,మీ సమాధానం మీద నా జీవితం ఆధారపడి వుంది. నేనొక అమ్మాయిని గాఢాతిగాఢంగా ప్రేమించాను. నా ప్రేమను వ్యక్తం చేసి- పెళ్లి చేసుకుందామని అడిగాను. మా అమ్మానాన్నలు ఆమెని ఇష్టపడ్డారు. మా పెళ్లికి అంగీకరించారు. అప్పుడు ఆమె తను కూడా నన్ను ప్రేమిస్తున్నాననీ- పెళ్లి చేసుకుందామని అంది. తర్వాత ఒకరోజు వాళ్ల అమ్మానాన్నలతో మాట్లాడమని ఇంటికి ఆహ్వానించింది. నేను వాళ్ల నాన్నగారిని మర్యాదగా అడిగాను. ఆయన అంతకంటే మర్యాదగా తిరస్కరించాడు. కారణం ఒక్కటే మా కులాలు వేరు. నేను బాగా అప్‌సెట్ అయ్యాను. ఆమె లేనిదే నాకు జీవితమే లేదు. వాళ్లకి ఇష్టం లేకపోయినా-మా అమ్మానాన్న సపోర్టుతో ఆమెను సొంతం చేసుకోవచ్చుననే ఆశతో ఉన్నాను కానీ- ఆ మర్నాటి నుంచి ఆమె ప్రవర్తన మారి పోయింది. తనను మర్చిపోమనీ-మా పెళ్లి జరగదని చెప్పింది. ఆమెకు ప్రేమకన్నా అమ్మా నాన్నలు-వారి పరువు ముఖ్యమనీ చెప్పింది. ఇది నేను ఊహించనిది కావటంతో తట్టుకోలేకపోతున్నాను. అందుకే నేనొక నిర్ణయానికి వచ్చాను. ఆఖరిగా ఆమెను రిక్వెస్ట్ చేస్తాను. ఆమె ఒప్పుకుందాసరి లేకపోతే ఆత్మహత్యే శరణ్యం.**

**నా ఆత్మహత్యకు తేదీ కూడా నిర్ణయించుకున్నాను. ఈలోగ మీ దగ్గర్నుంచి జవాబు వస్తే సరి లేకపోతే మీ జవాబు చదవటానికి నేనుండను. ఎలా చచ్చిపోవాలో దానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ చేసుకున్నాను. ఆ తర్వాత మీ ఇష్టం. ఆమెను మరిచిపోమనీ- చదువుకోమనీ- నాకు సలహా చెప్పకండి! నాకు ఆమె కావాలి! అంతే!**

**జవాబు:** డియర్ వినోద్ నువ్వు చాలా ఆవేశంలో వున్నావు. ఆ అమ్మాయి ఒప్పుకోకపోతే -నీ కోపం నా మీద చూపిస్తే ఎలా చెప్పు.ఇలా ఆత్మహత్యకు డేట్ ఫిక్స్ చేసుకొని కౌంట్‌డౌన్ ప్రారంభించి నన్ను కంగారుపెట్టడం ఏమైనా బావుందా? కాస్త టైమివ్వు బాబూ! ఆలోచించనీ...ప్రతి సమస్యకీ ఒక పరిష్కారముంటుంది.ఆ పరిష్కార మార్గం అన్వేషించడానికి కాస్త టైం పడుతుంది. ఆమె ఒప్పుకుంటే సరి- లేకపోతే ఛస్తాను! ఏమిటిది? ఇలా అర్థాంతరంగా చావటానికి ప్రేమించావా? కాస్త ఓపిగ్గా ఆలోచించి ప్రేమను సాధించాలిగానీ...చచ్చి ఏమి సాధిస్తావు. నువ్వే ప్రపంచంగా బతికే అమ్మానాన్నలకు కడుపుకోత మిగులుస్తావు అంతేగా? అసలు వాళ్లు చేసిన తప్పేంటి? ఆ అమ్మాయిని నువ్వు తీసుకెళ్ళగానే ఆదరించి- మీ ప్రేమను అర్థం చేసుకుని-మీ పెళ్లికి ఒప్పుకోవటమా? నీ ప్రియురాల్ని చూడు. తన ప్రేమను కాదన్నా-తన మనసును అర్థం చేసుకోలేకపోయినా తన పేరెంట్స్ అంటే ఎంత గౌరవం...ఎంత ప్రేమ. వాళ్లకోసం తన ప్రేమను త్యాగం చేయటానికి సిద్ధపడింది. మరి నువ్వు ఎందుకంత దూకుడుగా ఆలోచిస్తావు.

ఆమెను సాధించుకోవాలంటే ముందు నువ్వు బతికి ఉండాలి. నువ్వు వెంటనే మళ్ళీ నాకు మెయిల్ చెయి. ఫిబ్రవరి 20 తేది తర్వాత వార్త ద్వారా నన్ను కలువు.ఈలోగా ప్రశాంతంగా ఆలోచించడానికి ప్రయత్నించు. మెయిల్‌లో నాతో కాంటాక్ట్‌లో ఉండు.

(challaspen@yahoo.com)

---

పొయ్యిల కట్టెలులేవని విమలంటే గొడ్డలి తీసుకొని అడవిలకు పోయిండు లక్ష్మణ్. అడవిలో కట్టెలు కొడుతుంటే ఎన్నెన్నో చిన్నప్పటి ఆటలు పాటలు జ్ఞాపకాలు. చెమటలు కారుతుంటే అలసటకు బదులు ఆనందం కలిగింది లక్ష్మణ్‌కు.

సైకిల్‌కు సరిపడా కొట్టుకొని కట్టుకొని వస్తుండంగ ఫారెస్టు గార్డు అడ్డగించి పైసలు అన్నడు. గింతసేపు కట్టెలు కొడ్తె కనవడనోడు గిప్పుడెట్ల వచ్చె అనుకున్నడు లక్ష్మణ్. వాని పనే తప్పులు వట్టుడు అని లక్ష్మణ్‌కు తెలువది.

"పైసలియ్యకపోతే కేసువెట్టి జేల్లేపిత్త" అన్నడు గార్డు.

"పైసలు తీస్కరాలె. మల్లస్త" అని సైకిలు అక్కన్నే పారేసి యిల్లు చేరిండు లక్ష్మణ్. మల్లా అటు పోలేదు లక్ష్మణ్.

ఏం పని లేదా అని విమల ఊకె గులిగితే నాలుగుగాలాలు తీసుకొని చేపలకని బయల్దేరిండు లక్ష్మణ్. చేపలు బాగనే దొరికినై. తోవలో అది చూసిన బెస్తోల్లు ఊర్లె పంచాయితి పెట్టిన్రు. ఆ చెరువును వాల్లె గుత్తకు తీసుకున్నరట. ఆ చెరువు కింది బావులు కాల్వల చాపలు గూడా మావే అన్నరు. కాళ్ళు పట్టుకొని వాల్ల సంగానికి దండుగ కట్టి బయటపడ్డడు లక్ష్మణ్.

"అట్ల సైకిల్ పోగొట్టినవు. ఇట్ల దండుగు కట్టినవు. నువ్వు ఏ పని చేసినా యిగ గింతే. ఉన్నకాడ సప్పుడంట కూసో" అన్నది విమల.

అల్లుడు లక్ష్మణ్‌కు అంతా అయోమయంగా ఉంది. ఈ భూమి, నీరు, చెరువు, అడవి, చెట్టు, కట్టెపుట్ట ఏదీ తనదికాదు.ఈ ప్రకృతి ఎంత అందమైనదో. ఈ పల్లె ఎంత ప్రశాంతమైనదో... కానీ యిందులో తనకేమీ చెందదు. ఈ గాలికూడా తనదవునోకాదో... ఈ చెట్లు చేమలు పక్షులు చేపలు పొలాలు చెరువులు ఏవీ తనవి కావు. ఈ పల్లెను ఎట్లా ప్రేమించాలె. ఈ పల్లెల ఎట్లా ఉండాలె. ఇన్నాళ్ళు ఆ ఉద్యోగం తనది అనుకున్నడు. ఆ ఉద్యోగం పోయింది. ఉద్యోగ భద్రత కూడా పోయింది. తనకు జీవితంలో మిగిలిందేమిటి? ఈ పాత యిల్లొక్కటేనా?

తన జీవితం యిక అంతా ప్రశాంతమే. అల్లుడు లక్ష్మణ్ రోజూ ఆ వూరి చెరువు కట్టమీదో, ఈదుల్ల మర్రి కిందో వెల్లకిలా పడుకుంటడు.

"నాన్నా అమ్మ అన్నం తిన రమ్మంటంది" అని పిల్లలు వస్తే పోయి కాస్త తింటడు. మల్లా ఏదో చెట్టు కిందికి చేరుతడు.

ఎల్లయ్యకు అల్లుని స్థితి చూసి ఏంచేయాలో తోచలేదు.తన కండ్ల ముందే ఎదిగిన కొందరి జీవితాలు... శిథిలమై విధ్వంసమవుతున్న సమాజం. బైరాగితత్వాలు సమాజ విధ్వంసాన్ని ప్రశాంతంగా భరించే శక్తి నిస్తున్నాయి. ఆ తత్వాలు ఎందుకు పుట్టినయో ఎల్లయ్యకు యిపుడు అర్థమైంది. విమలకు అర్థంకాలేదు. తండ్రిని, భర్తను చూసి ఎవరూ చూడకుండా కన్నీరు కారుస్తుంది.

ఆమె దుఃఖంలో కోపం లేదు- ప్రశాంతంగా ఏడుస్తుంది. ఆ ప్రశాంతతలో ఒక నిరాశ. ఒక నిర్వేదం. అది ఒక సమాధి దశ. రేపటి సమాజం కూడా యింతేలే అని ఆశలన్నీ సమాధి అవుతున్న దశ. తండ్రి ఎల్లయ్య బైరాగితత్వం రాగం తీస్తున్నడు. ఇల్లంతా విధ్వంస చిహ్నాలకు బదులుగా విషాదం ప్రశాంతంగా చిక్కగా పరుచుకుంటున్నది.